క్లుప్తంగా

రేషన్ షాపుపై కేసు నమోదు

నాగులుప్పలపాడు (మద్దిపాడు): మండలంలోని బి. నిడమానూరు గ్రామంలో ఉన్న 48వ నెంబర్ రేషన్ షాపును ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వంశీ, ఆర్ఐ ప్రమోద్ మంగళవారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. రేషన్ షాపుపై వచ్చిన ఫిర్యాదుల మేరకు వారు తనిఖీ చేయగా లెక్కకు మించి 32 బస్తాల బియ్యం అదనంగా లభించడంతో షాపు యజమాని ఊదరగుడి చిరంజీవిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ల్యాప్‌టాప్ వితరణ



ల్యాప్‌టాప్ అందిస్తున్న రోటరీక్లబ్ అధ్యక్షులు, సభ్యులు

చీమకుర్తి: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బీటెక్ విద్యార్థినికి ల్యాప్‌టాప్‌ను అందించారు. నాణ్యమైన విద్యాప్రమాణాల కోసం రోటరీ క్లబ్ అధ్యక్షులు కడవా రామకృష్ణ, వ్యవస్థాపక అధ్యక్షుడు చెరుకూరి రఘుకిరణ్ చేతుల మీదుగా మంగళవారం చీమకుర్తిలో ఆమె తండ్రికి అందించారు. రోటరీ సేవలను విస్తృతం చేసేందుకు ముందుకు అడుగులు వేస్తున్నట్లు క్లబ్ సభ్యులు ధీమా వ్యక్తం చేశారు. గొల్లపూడి వెంకట్రావు, కె.సుధాకర్, అంబటి వీరా రెడ్డి, మన్నం నాగరాజు, స్థానికులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల తనిఖీ



ఎరువుల నిల్వలు పరిశీలిస్తున్న డీఎం హరికృష్ణ, ఏఓ రమేష్ తదితరులు

మద్దిపాడు: మండలంలోని వెల్లంపల్లి, దొడ్డవరం రైతు సేవా కేంద్రాల్లో ఎరువుల నిల్వలను మంగళవారం మధ్యాహ్నం మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ తనిఖీ చేశారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాలకు ఎరువులు పంపిన నేపథ్యంలో ఆయన గోడౌన్‌లో ఉన్న స్టాకుకు ఆన్‌లైన్‌లో ఉన్న స్టాకు సరిపోయిందా లేదా అన్న అంశాలను పరిశీలించారు. స్టాకు సరిగా ఉన్న నేపథ్యంలో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కె. రమేష్, జిల్లా వ్యవసాయ కార్యాలయ ఏఓ కిషోర్, ఏఈఓ శ్రీనివాసరావు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పోషక విలువలపై తల్లులకు అవగాహన



పోషక ఆహార పదార్థాలు ప్రదర్శిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

చీమకుర్తి: ఎక్కువ పోషకాలున్న ఆహార పదార్థాలపై తల్లులకు ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మావతి అవగాహన కల్పించారు. పౌష్టికాహార మాసోత్సవం సందర్భంగా మంగళవారం సంతనూతలపాడు మండలం మంగమూరు అంగన్‌వాడీ కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎక్కువ పోషకాలున్న ఆహార పదార్థాలను ప్రదర్శించి వాటి ప్రాధాన్యతను వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు హాజరయ్యారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

కొనకనమిట్ల: వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని ఎస్ఐ మాధవరావు సూచించారు. మంగళవారం సాయంత్రం కొనకనమిట్ల సమీపంలో జాతీయ రాహదారిపై వాహనాలు తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో ప్రజలకు కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. గణేశ్ మండపాలకు తప్పనిసరిగా పోలీస్, విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలని కమిటీల నిర్వాహకులకు స్పష్టం చేశారు.

పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి

మార్కాపురం టౌన్: పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై మరికొందరు దాడి చేసిన సంఘటన మంగళవారం స్థానిక చిన్నమసీదు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని చిన్నమసీదు ప్రాంతంలో నివాసముండే షేక్ మహమ్మద్, ఎమ్ఆర్‌కే బాషా మధ్య పాత గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో మంగళవారం ఇళ్ల వద్ద మహిళల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో మహమ్మద్‌పై ఎమ్ఆర్‌కే బాషా, ఆయన కుమారులు దాడి చేశారు. గాయపడిన మహమ్మద్‌ను తొలుత మార్కాపురం జీజీహెచ్‌కు, అనంతరం మెరుగైన చికిత్స కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఘర్షణ విషయమై ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు అందాయని పోలీసులు తెలిపారు.



కొప్పోలు వద్ద గుర్రపుడెక్కతో నిండిన పోతురాజు కాలువ



కమ్మపాలెం రోడ్డులో పోతురాజు కాలువ దుస్థితి

వానొస్తే ముప్పే..

● అధ్వానంగా పోతురాజు కాలువ ● ఆక్రమణలతో కుంచించుకుపోతున్న వైనం ● వరదలు వస్తే ఒంగోలు నగరం మునగక తప్పదు

జిల్లా కేంద్రం ఒంగోలు రోజురోజుకూ పెరిగిపోతోంది. చుట్టు పక్కల నుంచి వచ్చేవారు ఇక్కడే స్థిర నివాసాలు ఏర్పరచుకుంటున్నారు. అలాగే వివిధ వ్యాపారాలు, వృత్తులు, ఉద్యోగాలు చేసేవారు అద్దెకు ఉంటారు. ఇన్ని లక్షల మంది నిత్యం టన్నుల కొద్దీ వ్యర్థాలు ఉత్పత్తి చేస్తుంటారు. అలాగే మురుగు ఉత్పత్తి అవుతుంది. ఇవన్నీ కూడా పోతురాజు కాలువ నుంచే సముద్రం వైపు వెళ్లాలి. అలాగే వరద నీరు కూడా ఈ కాలువ నుంచే పారుతుంది. కానీ ప్రస్తుతం ఈ కాలువ పరిస్థితి అధ్వానంగా ఉంది. పోతు రాజు కాలువ నిత్యం ఆక్రమణలకు గురవుతోంది. దీనివల్ల కాలువ కుంచించుకుపోతూ మురుగు, వరద నీరు సక్రమంగా ముందుకు కదిలే పరిస్థితి లేకుండా పోయింది. ఇక కాలువలో గుర్రపు డెక్క, పిచ్చి చెట్లు పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. అలాగే ప్లాస్టిక్ వ్యర్థాలతో పేరుకుపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో వరద నీరు పొంగితే ఒంగోలు నగరం మునిగే పరిస్థితులు దాపురించక తప్పదు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం పోతురాజు కాలువ ఆధునీకీకరణకు చర్యలు తీసుకుంటే మంచిది.

- సాక్షి, ఒంగోలు



కాలువ కట్టపై ఇళ్ళు నిర్మించడంతో చిన్నదైన పోతురాజు కాలువ విస్తీర్ణం



60 అడుగుల రోడ్డులో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన పోతురాజు కాలువ



చెట్లు పెరిగి అడవిని తలపిస్తున్న కాలువ



పోతురాజుకాలువ కట్టపై నిర్మించిన ఇళ్లు



పాపా కాలనీ వద్ద పిచ్చి చెట్లతో..

పన్ను వేయని ఇళ్లను గుర్తించండి

● ఆస్తి పన్ను వసూలులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు
● ఖాళీ స్థలాలను గుర్తించి వాటి యజమానులతో శుభ్రం చేయించాలి



అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలో ఆస్తి పన్ను వేయని ప్రతి ఇంటినీ పన్ను పరిధిలోకి తీసుకురావాలని అధికారులకు, సిబ్బందికి ఒంగోలు నగర కమిషనర్ డాక్టర్ కూడూరు వెంకటేశ్వర రావు ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో మంగళవారం వార్డు సచివాలయాల అడ్మిన్లతో, నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారులతో నిర్వహించిన సమీక్షలో స్పష్టం చేశారు. నగర పాలక సంస్థకు చెందిన రెవెన్యూ ఆఫీసర్లు (ఆర్ఓ), రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు(ఆర్ఐ), వార్డు సచివాలయాల అడ్మిన్లు చురుకుగా పాల్గొని ఆస్తి పన్నులు వసూలు చేయాలన్నారు. ప్రతి రోజూ ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు పన్ను బకాయిలను వసూలు చేయాలని సూచించారు. అండర్ అస్సెస్డ్ ఇళ్ళను గుర్తించి పన్ను సక్రమంగా విధించాలన్నారు. ప్రధానంగా పన్నులేని ఇళ్లను స్పష్టంగా గుర్తించాలని, అలాంటి ఇళ్ళను పన్ను పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు. నగరంలో ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించి వాటి యజమానులతో శుభ్రం చేయించాలని స్పష్టం చేశారు. ఖాళీ స్థలాలకు పన్ను ఇప్పటి వరకూ వేయకపోతే ఇక నుంచి తప్పనిసరిగా పన్ను వేయాలని ఆదేశించారు. మున్సిపల్ దుకాణాలకు సంబంధించి అద్దె వసూలు బాధ్యతను అడ్మిన్ సెక్రటరీలకు కేటాయిస్తూ వారి ద్వారా 100 శాతం అద్దె బకాయిలు వసూలు చేసేవిధంగా చర్యలు చేపట్టాలని ఆర్ఓ, ఆర్ఐలను ఆదేశించారు. సెప్టెంబర్ నెలతో ఈ అర్ధ సంవత్సరం ముగుస్తున్నందున 100 శాతం పన్నులు వసూలు చేసేవిధంగా ప్రణాళికలు రూపొందించుకొని వసూలు చేయాలని సూచించారు. ఆర్ఓలు, ఆర్ఐలు వారికి సంబంధించిన వార్డు సచివాలయ అడ్మిన్లతో ప్రతి వారం సమీక్షలు నిర్వహించుకొని పన్నుల వసూలులో మెరుగైన ఫలితాలు రాబట్టాలన్నారు. పన్నులు చెల్లించే విషయంలో నగర ప్రజలు కూడా అధికారులకు, సిబ్బందికి సహకరించి ఒంగోలు నగర పాలక సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

విజయవాడకు 100 మంది పారిశుద్ధ్య కార్మికులు

విజయవాడలో వరద బాధితులకు సాయం చేసేందుకు ఒంగోలు నగర పాలక సంస్థ నుంచి 100 మంది కార్మికులను పంపారు. ఈ కార్యక్రమంలో మేయర్ సుజాతతో పాటు కమిషనర్ వెంకటేశ్వర రావు, డిప్యూటీ మేయర్ బుజ్జి, ఇతర అధికారులు ఉన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించండి



నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని కోరుతూ ఈ నెల 6న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నా విజయవంతం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలో ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు నిత్యావసర వస్తువులను తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత సామాన్యులను గాలికి వదిలేశారని విమర్శించారు. రోజురోజుకూ నిత్యావసర వస్తువుల ధరలు నింగినంటుతున్నాయని, చింతపండు, బియ్యం, ఉప్పు,పప్పు ధరలు పెరిగిపోవడంతో నిరుపేద, సామాన్య ప్రజలు ఏమీ కొనే పరిస్థితి లేదని, ఏమీ తినే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గోరుచుట్టుపై రోకలిపోటు అన్న చందంగా డీజిల్, పెట్రోలు ధరలను పెంచుతున్నారని, ప్రజా పంపిణీ వ్యవస్థ పక్కదారి పట్టిందని చెప్పారు. ఆహార భద్రతా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, కేరళ తరహాలో నిత్యావసర వస్తువులను చౌక ధరలకే అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొత్తకోట వెంకటేశ్వరరావు, శ్రీరాం శ్రీనివాసరావు, ఎంఏ సాలార్, హరికృష్ణ, పీవీ కృష్ణారావు, సుందరం నరసింహరావు, డానియేల్ పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణకు సహాయ చర్యలు



వరద ముంపు ప్రాంతంలో సేవలు అందిస్తున్న విద్యుత్ సిబ్బంది

యర్రగొండపాలెం: విజయవాడ వరద ప్రాంతాల్లో దెబ్బతిన్న విద్యుత్ లైన్ పునరుద్ధరించేందుకు యర్రగొండపాలెం ఏఈ అల్లూరయ్య ఆధ్వర్యంలో లైన్‌మెన్, షిఫ్ట్ ఆపరేటర్లు మంగళవారం అక్కడికి చేరారు. వరద ప్రాంతాల్లో సేవలు అందించడం తమ అదృష్టమని, పనులు పూర్తి అయిన వెంటనే తాము స్థానికంగా విధుల్లో చేరుతామని వారు తెలిపారు.

జీవకోటికి మొక్కలే ప్రాణాధారం



మొక్కలు నాటుతున్న ఏకేయూ వీసీ ప్రొఫెసర్ మూర్తి

ఒంగోలు: సమస్త జీవకోటికి మొక్కలు ప్రాణాధారం అని ఆంధ్రకేసరి యూనివర్శిటీ వీసీ.. ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి అన్నారు. మంగళవారం ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో మొక్కలు నాటిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి మనిషి కనీసం ఒక మొక్క అయినా నాటి సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. మానవాళికి, జీవకోటి కాలుష్యం బారిన పడకుండా మొక్కలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం మొక్కలు నాటే కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ఇదే కార్యక్రమాన్ని ఏకేయూ కూడా చేపట్టిందన్నారు. రిజిస్ట్రార్ బి.హరిబాబు మాట్లాడుతూ మొక్కలు పర్యావరణాన్ని కాపాడడంలోను, కాలుష్య నివారణ, ప్రాణవాయువును అందించడం, సకాలంలో వర్షాలు కురిసేందుకు సహకరిస్తాయన్నారు. యూనివర్శిటీ కాలేజీ ప్రిన్సిపాల్ రాజమోహన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా జీవనోపాధులకు ప్రయోజనాలను ఇస్తున్న మొక్కలను అన్ని ప్రాంతాల్లో నాటడంతో పాటు వాటిని బతికించుకుని భవిష్యత్ తరాల జీవకోటికి అందించాల్సిన అవసరాన్ని వివరించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతందేవ్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ శాస్త్ర మేధావులు సూచించిన ప్రకారం నేటి ఆధునిక కాలంలో సమాజాన్ని కాలుష్య కోరల నుంచి కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటే కారక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. సీడీసీ డీన్ డాక్టర్ జి.సోమశేఖర, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలామణి, ఏసీఈ డాక్టర్ బి.పద్మజతో పాటు పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో దిగుబడి

యర్రగొండపాలెం: అధిక వర్షాల కారణంగా ఉద్యాన పంటల్లో వచ్చే తెగుళ్లను అరికట్టేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని హెచ్ఓ పి.ఆదిరెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని పలుప్రాంతాల్లో రైతులు సాగు చేస్తున్న బొప్పాయి, అరటి, కూరగాయల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. బొప్పాయిలో కాండం కుళ్లు, వేరుకుళ్లు తెగులు రాకుండా రిడోమిల్ 2 గ్రాములు లేదా అలియట్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్క మొదళ్లలో పోయాలన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

విజయవాడ వరద బాధితులకు చేయూత

ఒంగోలు సబర్బన్: విజయవాడను అతలాకుతలం చేసిన వరదల్లో తీవ్రంగా నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు ఒంగోలు నుంచి మూడు లారీల్లో ఆహార పొట్లాలు, వాటర్ బాటిళ్ళు పంపించారు. స్థానిక టీడీపీ కార్యాలయం నుంచి మూడు లారీల్లో తరలించారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌తో పాటు మేయర్ సుజాత ఇతర నాయకులున్నారు.

ఫీవర్ సర్వే పూర్తి చేయాలి

పొదిలి రూరల్: అన్ని గ్రామాల్లో ఫీవర్ సర్వే చేపట్టాలని వైద్య సిబ్బందికి డాక్టర్ ఎం.సుగుణకుమార్ సూచించారు. మంగళవారం ఉప్పలపాడు పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. వర్షాలు కురుస్తున్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఈ నెల 17 నుంచి డీవార్మింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ నెల 15 వరకే ఇ- క్రాప్ నమోదు



రాజుపాలెంలో వేరుశనగ పంట పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

కొత్తపట్నం: ఇ- క్రాప్ నమోదు గడువు ఈ నెల 15వ తేదీతో ముగుస్తుందని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో రాజుపాలెం పంట పొలాలను మంగళవారం పరిశీలించారు. పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2,150 ఎకరాలు ఇ- క్రాప్ చేయవల్సి ఉండగా ఇప్పటికి 2 వేల ఎకరాల్లో పూర్తయిందని చెప్పారు. మిగతా 150 ఎకరాలు ఈ నెల 15 లోపు నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. కౌలు రైతు కార్డులను పొలం యజమానులను ఒప్పించి తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం నుంచి ఏ రాయితీ కావాలన్నా ఇ- క్రాప్ తప్పని సరన్నారు. ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకులు బి.రమేష్ బాబు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షానికి పంటలు ఏమైనా దెబ్బతిన్నాయా ఆరా తీశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, విస్తరణ అధికారి అజయ్, రాజుపాలెం వ్యవసాయ సలహాయకులు మృధులత, రైతులు పాల్గొన్నారు.

నైపుణ్యం ఉంటే అపార అవకాశాలు



శ్రావణ్‌కుమార్‌ను అభినందిస్తున్న మద్దిశెట్టి శ్రీధర్ తదితరులు

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం మేగ్నెటిక్ ఫీల్డ్స్‌పై గెస్ట్ లెక్చర్ కార్యక్రమం నిర్వహించారు. కాలేజీ పూర్వ విద్యార్థి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన ఐ.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ పరిశ్రమలో మేగ్నెటిక్ ఫీల్డ్స్ అవసరాలు, విశిష్టతలు వివరించారు. కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ నైపుణ్యం కలిగిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు అపారంగా ఉన్నాయని, దానికి తగిన విధంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. పరిశ్రమలో పనిచేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ట్రిపుల్ ఇ విభాగం అధిపతి నాగరాజు, కోఆర్డినేటర్ విజయేంద్రరావు, కో కన్వీనర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల నియంత్రణకు పటిష్ట చర్యలు



ముండ్లమూరులో మాట్లాడుతున్న వైద్యాధికారి జాస్మిన్

ముండ్లమూరు(దర్శి): మండలంలో జ్వరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు వైద్యాధికారి ఎం జాస్మిన్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశాడే కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయడంలో సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. వాతావరణ పరిస్థితుల కారణంగా వర్షాల ప్రభావంతో గ్రామాలు సాధారణ జ్వరాలు ఉన్నాయని వాటి నియంత్రణకు ప్రతి గ్రామంలో సిబ్బంది ఇంటింటికీ తిరిగి అవసరమైన మందులు పంపిణీ చేయాలన్నారు. రెండు మూడు రోజుల్లో జ్వరం తగ్గకుంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువస్తే అవసరమైన పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తామన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో పది మంది నేత్రదాన అంగీకార పత్రాలుధిచ్చారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. అంధత్వ నివారణలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నారాయణరావు, సిబ్బంది శారదా, సుబ్బారావు, కన్యాకుమారి, యుగంధర్, నాగార్జున, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటలకు జీవం పోసిన వర్షం



సజ్జ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

దొనకొండ: మూడు రోజుల పాటు కురిసిన వర్షానికి గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలకు జీవం పోసిందని వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. ముఖ్యంగా మెట్ట పంటలైన కంది, పత్తి, ఆముదం, పొగాకు రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. మండలంలో మూడు రోజుల్లో 107 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. ఎటువంటి పంటలకు నష్టం లేదన్నారు. పొలంలో నీరు నిలబడకుండా 25 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్ చల్లాలన్నారు. మంగళవారం పోలేపల్లిలోని సజ్జ, కంది పంటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు చేశారు. ఆయన వెంట వ్యవసాయ సిబ్బంది ఈశ్వరరెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి



పొలంబడిలో అవగాహన కల్పిస్తున్న ఏఓ ప్రసాద్‌రావు

తాళ్లూరు(దర్శి): మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ప్రతికూల వాతావరణంలో కూడా అధిక దిగుబడులు పొందవచ్చని ఏఓ ప్రసాద్‌రావు సూచించారు. మండలంలోని నాగంబొట్లపాలెం, అయ్యలపాలెంలలో క్షేత్ర పర్యటనలో భాగంగా సజ్జ పంటలను పరిశీలించారు. సజ్జలో అంకుర దశ, పూత దశ గింజ పాలు పోసుకునే దశ, గింజ గట్టి పడే దశలు కీలకమన్నారు. ఈ సున్నిత దశల్లో నీటి తడులివ్వాలని తెలిపారు. ప్రకృతి సాగు ఇన్‌చార్జి పి.నరసింహులు మాట్లాడుతూ ద్రవ జీవామృతాన్ని నీరు పారించేటప్పుడు 200 లీటర్లు ఎకరా పొలంలో పారించాలన్నారు. ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పీవీ రమణ మాట్లడుతూ వరికి తప్ప అన్నీ పైర్లు వేసుకునే రైతులకు డ్రిప్, స్పింకర్ల పైపులు రాయితీపై మంజూరు చేస్తున్నామన్నారు. వీఏఏ డి.శ్రీను, వర్షిణి, వాణి, కోటిరత్నం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వివాదాస్పద భూమిపై విచారణ

తాళ్లూరు(దర్శి): మండలంలోని సర్వే నంబర్ 474లో ఉన్న ప్రభుత్వ అనాధీన పోరంబోకు వివాద భూమిని తహసీల్దార్ శింగారావు మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించుకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సర్వేయర్ బాబురావు,రెవెన్యూ సిబ్బంది కలిసి భూమిని పరిశీలించారు. ఆక్రమదారుల విషయంలో విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.